క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి పరామర్శ



సంపూర్ణమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రామిరెడ్డి

బిట్రగుంట : బోగోలు మండలం పాతబిట్ర గుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్తం సురేందర్‌రెడ్డి తల్లి సంపూర్ణమ్మ (82) అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాతబిట్రగుంటలో సంపూర్ణమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం సురేందర్ రెడ్డిని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

మర్యాదపూర్వకంగా..



కావలి : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా నియమితులైన షేక్.షాహుల్ హమీద్ కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కావలిలోని ఆయన నివాసంలో కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

మొండి బకాయిలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఏజీఎం

ఉదయగిరి : స్త్రీనిధి రుణాలకు సంబంధించిన మొండి బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కామాక్షయ్య అన్నారు. ఆయన స్థానిక స్త్రీశక్తి భవనంలో సీసీలు, వీఓఏలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో స్త్రీనిధికి సంబంధించి రూ.4 కోట్ల మేర మొండి బకాయిలు ఉన్నాయన్నారు. ఉదయగిరి మండలానికి సంబంధించి రూ.7 లక్షల బకాయిలున్నాయన్నారు. వీటిని ఈనెల చివరి నాటికి నూరుశాతం వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాజారంతుల్లా, మేనేజర్లు నరసింహారావు, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘ ఉపాధ్యక్షుడిగా శివయ్య



శివకుమారశర్మ

ఆత్మకూరు : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ఆత్మకూరుకు చెందిన మేళ్లచెరువు శివకుమారశర్మ(శివయ్య) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గుంతకల్లులో జరిగిన బ్రాహ్మణ సంఘాల రాష్ట్ర మహాసభల్లో మంగళవారం ఆయన్ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దీంతో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న శివశంకర్‌రెడ్డి

చేజర్ల : మండలంలోని కొల్లపనాయుడుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి అనే వ్యక్తికి తన అన్న కొడుకులతో కొద్దికాలంగా పొలం, తోట విషయంలో తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో శివశంకర్ రెడ్డి తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం అతను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



వరికుంటపాడు : విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచే పోటీతత్వం పెరగాలని ఎంఈఓ-1 షేక్.మస్తాన్‌వలీ అన్నారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు తరగతి గదిలో సంతోషంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆటపాటల ద్వారా బోధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

ప్రకృతి సేద్యం.. ఫలించిన సంకల్పం

- పురుగు మందుల్లేకుండా వరిసాగు
- దిగుబడి సైతం ఆశాజనకం
- సాధారణం కంటే కంకికి 207 గింజలు అధికం

ప్రస్తుత కాలంలో పురుగు మందుల్లేకుండా వరిసాగు చేయడం అత్యంత కష్టం. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వల్ల పలు కంపెనీలు విపరీతంగా రసాయన మందులను పిచికారీ చేసేలా రైతులను ప్రేరేపితం చేస్తున్నాయి. దీంతో విధిలేక తెగుళ్ల, పురుగుల నివారణ కోసం వారు ఇచ్చే మందులను రైతులు పిచికారీ చేయక తప్పడంలేదు. అయితే దానికి భిన్నంగా ఓ రైతు పురుగు మందులను పిచికారీ చేయకుండానే సహజ సిద్ధంగా నాణ్యమైన పంటను పండించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆత్మకూరు : మండలంలోని నల్లపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యల్లాల శ్రీనివాసులురెడ్డి తన సొంత పొలం పది ఎకరాల్లో వరి పైరు (కేఎస్ఎం 1638)ను సాగు చేశారు. ఆన్‌లైన్‌లో పురుగు మందుల్లేని వరిపైర్ల గురించి వస్తున్న కథనాలు ఆయన్ను ప్రభావితం చేయడంతో తానూ అలాగే సాగు చేయాలని సంకల్పించుకున్నారు. తొలుత దుక్కి దున్ని సిద్ధం చేసుకున్న నారుమడిలో వరి నారు (మొలక కట్టిన గింజలు) చల్లాడు.

సంప్రదాయ పద్ధతిలో..

శ్రీనివాసులురెడ్డి నారు పోసిన నాటి నుంచి నాట్లు వేసే వరకు 26 రోజుల పాటు నారును నిశితంగా పరిశీలించేవారు. నారుపై ఎలాంటి పురుగు మందులు పిచికారీ చేయలేదు. అనంతరం నాట్లు వేసే ప్రధాన పొలంలో దుక్కిదున్ని నీరు కట్టి బురద సేద్యం చేసి సహజ సిద్ధమైన నారును కూలీలతో నాటించారు. నాలుగు నెలల 10 రోజుల్లోపు కాలవ్యవధి కలిగిన ఈ పైరు ఏపుగా ఎదిగింది. నాటినప్పటి నుంచి చిరుపొట్ట దశలో, వెన్ను దశలో ఒక్కసారి కూడా ఎలాంటి పురుగు మందులను పిచికారీ చేయలేదు. సాధారణంగా పాముపొడ తెగులు, వెన్ను దశలో వచ్చే అగ్గి తెగులు వరి పైరును వేధిస్తుంటాయి. అయితే అవి రాకుండా సంప్రదాయ పద్ధతిలో పొలంలో గట్లపై గడ్డిలేకుండా పరిశుభ్రంగా ఉంచితే తెగుళ్ల శోకవని.. ఆ పద్ధతిని పాటించారు. అదే క్రమంలో పైరుపై మిత్ర పురుగులైన సాలి పురుగులు, తూనీగలు అధికంగా సంచరిస్తుండడంతో పురుగు మందులను పిచికారీ చేస్తే అవి నాశనం అవుతాయని, మందులు వాడలేదని రైతు తెలిపాడు. మరో వారం రోజుల్లో వరి కోత కోయనుండగా ఎలాంటి తెగులు పైరుకు శోకకపోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు రైతు శ్రీనివాసులురెడ్డి సంతోషం వ్యక్తం చేశాడు.



పురుగు మందులను పిచికారీ చేయకుండానే ఏపుగా పెరిగిన వరిపైరు

దిగుబడి బాగుంది

గతంతో పోలిస్తే ఈ ఏడాది వరిపైరు సాగు చేసే రైతులకు ఎకరాకు రెండు పుట్లకు మించి దిగుబడి రావడం లేదు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పైర్లకు దిగుబడి తగ్గిందని పలువురు రైతులు చెబుతున్నారు. అయితే శ్రీనివాసులురెడ్డి తన పొలంలో ఎకరాకు మూడున్నర పుట్లకు (3024 కేజీలు) పైగా దిగుబడి రానున్నట్లు అంచనా ఉందని పేర్కొన్నాడు. సాధారణంగా వరి పైరులో కంకికి 172 గింజలు రావడం సహజం. అయితే ఈ రైతు సాగు చేసిన పైరులో ఓ కంకికి 207 గింజలు వచ్చాయి. దీంతో దిగుబడి ఆశాజనకంగా ఉందని రైతు తెలిపారు.



తాను పండించిన వరి పొలంలో రైతు శ్రీనివాసులురెడ్డి

కోడి పందేల స్థావరంపై దాడి



మర్రిపాడు : మండలంలోని బొంతవారిపల్లి వద్ద కోడిపందేల స్థావరంపై ఎస్సై శ్రీనివాసరావు తన సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. ఇందులో ఒకరిని అదుపులోకి తీసుకుని మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



మర్రిపాడు : మండలంలోని నందవరం ఏపీ మోడల్ పాఠశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు మంగళవారం ఎస్సై శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

- విధులకు హాజరు కాకుండానే వచ్చినట్లు సంతకాలు
- బుధవారం హాజరును మంగళవారమే వేసిన వైనం
- ఎంపీపీ తనిఖీలో సిబ్బంది వ్యవహారం వెలుగులోకి..

చేజర్ల : మండలంలో ఉపాధి హామీ సిబ్బంది పని తీరు ఇష్టారాజ్యంగా మారింది. కొందరు సిబ్బంది రేపటికి కూడా ముందు రోజే హాజరు వేసి డ్యూటీకి రాకుండా ఎగనామం పెడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సిబ్బంది గైర్హాజరై వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చేజర్ల మండల పరిషత్ కార్యాలయాన్ని ఎంపీపీ తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి మంగళవారం సందర్శించి అక్కడి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సదరు కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్లు రఘురామయ్య, జానీబాషా ఇద్దరూ 19వ తేదీకి సంబంధించి ముందే సంతకాలు చేసుకున్నారు. అంతే కాకుండా తనిఖీ సమయంలో కూడా వారు విధులకు డుమ్మా కొట్టారు. ఇదేమని ప్రశ్నించేందుకు అక్కడి సిబ్బంది కూడా ఎవరూ లేకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



19వ తేదీకి సంబంధించి ముందు రోజే హాజరు వేసిన సిబ్బంది

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

వరికుంటపాడు : రోజురోజుకు ఎండలు పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారిణి కరీష్మా పేర్కొన్నారు. ఆమె మంగళవారం రామదేవులపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా 37 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న తరుణంలో ప్రజలు ఉదయం 10.30లోపు పనులను పూర్తి చేసుకోవాలన్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలన్నారు. ఎక్కువగా మజ్జిగ, తాగునీరు, ఓఆర్ఎస్ తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండలంలోని మహిళలకు కుట్టు శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి మంగళవారం తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల మధ్య మహిళలు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. వీరికి 45 రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలియజేశారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- **అల్లూరు :** కుట్టు శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు ఎంపీడీఓ రజనీకాంత్ తెలిపారు. పూర్తి వివరాలకు సమీపంలోని సచివాలయాన్ని సంప్రదించాలని కోరారు.

పొగాకు రైతులు గట్టెక్కేనా?

- గతం కన్నా సాగు, పంట ఉత్పత్తి అధికం
- భారీగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- నేటి నుంచి పొగాకు కొనుగోలు ప్రారంభం

మర్రిపాడు : మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. అందుకు అవసరమైన ఏర్పాట్లను బోర్డు అధికారులు పూర్తి చేశారు. గత మూడేళ్లుగా పొగాకు మార్కెట్ బాగానే ఉండడంతో రైతులు కాస్త లాభాలు పొందినప్పటికీ ప్రస్తుత సీజన్‌లో పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా ధరలు పెంచి ఇస్తే భవిష్యత్తు పంట సాగు వైపు రైతులు మొగ్గు చూపుతారని తెలుస్తోంది. కరోనా అనంతరం పొగాకు వేలం ఆశాజనకంగా ఉండడంతో మూడేళ్లుగా మంచి డిమాండ్‌తో సాగింది.

ఈ ఏడాది భారీగా సాగు

2024-25 పంట కాలానికి డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలో 1,738 బ్యారెన్ల ద్వారా 2,069 మంది రైతులు 5,861 హెక్టార్లలో పంట సాగు చేపట్టారు. 7.43 మిలియన్ కిలోల సాగుకు అధికారులు అనుమతించారు. 5,890 ఎకరాల్లో ప్లాంటేషన్ చేపట్టారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వంటి పలు కారణాలతో పంట సాగు భారీగా పెరిగి తదనుగుణంగా ఉత్పత్తి కూడా అధికమైంది. ప్రధానంగా భూముల కౌలు, బ్యారెన్ అద్దెలు, కూలీల వేతనాలు ఇతరత్రా ఖర్చులు అధికమయ్యాయి. ఒక్కో బ్యారెన్‌కు గతంలో సగటున రూ.5 లక్షల వరకు అవుతుండగా ప్రస్తుత ఏడాది అదనంగా మరో లక్ష నుంచి లక్షన్నర రూపాయలకు పెరిగిందని రైతులు చెబుతున్నారు.


గతేడాది 9.75 మిలియన్ కిలోల సాగు

2023-24 పంట కాలంలో డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 6.30 మిలియన్ కిలోల పొగాకు పండించేందుకు అనుమతినివ్వగా 9.75 మిలియన్ కిలోల పొగాకును రైతులు పండించారు. సరాసరి ధర రూ.261.53 లభించింది. గతంలో ఉన్న ధరలతో పోల్చుకుంటే రూ.52.74లు అధికంగా రైతులకు లభించింది. అంతేకాక పొగాకు చూర, పందుగుల్ల సైతం విక్రయించారు. గతేడాది ఎలాంటి ఒడిదొడుకులకు లోనుకాకుండా రైతులు లాభాలతో పంట వేలం ముగించారు. ప్రస్తుత ఏడాదిలో ఎలా ఉంటాయా అని అటు రైతులు, ఇటు అధికారులు భావిస్తున్నారు.



పొగాకు పంట

తొలిరోజు విక్రయానికి 18 బేళ్లు



డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం తొలిరోజు 18 బేళ్లను విక్రయించేందుకు అధికారులు సిద్ధం చేశారు. ఉదయం 9.30 గంటలకు పొగాకు వేలం ప్రారంభమవుతుంది. రైతులు నాణ్యమైన పొగాకును వేలానికి తీసుకురావాలి. పొగాకులో ఎలాంటి అన్యపదార్థాలు కలవకుండా జాగ్రత్తగా తీసుకురావాలి.

– జి.రాజశేఖర్, వేలం కేంద్రం నిర్వహణాధికారి

డయల్ యువర్ డీఎం నేడు

ఉదయగిరి : ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల కోసం బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో తిరుగుతున్న బస్ సర్వీసుల సౌకర్యాలు, లాజిస్టిక్ సేవలు, డిపో అభివృద్ధికి తమ సూచనలు, సలహాలను 99592 25095 నంబర్‌కు తెలియజేయవచ్చన్నారు.

26న మండల సమావేశం

ఉదయగిరి : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26వ తేదీ ఉదయం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ అప్పాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

ప్రైవేట్ బస్సుపై కేసు నమోదు

ఉదయగిరి : మండలంలోని కుర్రపల్లి వద్ద సోమవారం రాత్రి ఓ ప్రైవేట్ బస్సు గేదెను ఢీకొన్న ఘటనకు సంబంధించి మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ ప్రమాదంలో నలుగురు రైతులకు సంబంధించి ఎనిమిది గేదెలు మృతిచెందినట్లు తెలియజేశారు.

ముగ్గురు ఏఎన్ఎంలకు పదోన్నతి

వరికుంటపాడు : వరికుంటపాడు, వేంపాడు, తిమ్మారెడ్డిపల్లి గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న వారికి మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్‌గా పదోన్నతి లభించినట్లు మండల వైద్యాధికారిణి కరీష్మా మంగళవారం తెలిపారు. వరికుంటపాడు ఏఎన్ఎం బి.జానకి, భాస్కరపురం, వేంపాడు ఏఎన్ఎం సీహెచ్ కవితతో పాటు తూర్పుబోయమడుగుల, తిమ్మారెడ్డిపల్లి ఏఎన్ఎం షేక్.రేష్మాలను సబ్ సెంటర్లకు నియమించారు.

లబ్ధిదారులకు భూములు చేరాలి

కావలి : విడవలూరు మండలం ఊటుకూరు గ్రామంలో భూమి కొనుగోలు పథకం భూములు లబ్ధిదారులకు చేరాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. కావలి పట్టణంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2018లో భూమి కొనుగోలు పథకం కింద ప్రభుత్వం విడవలూరు మండలం ఊటుకూరు గ్రామంలో దళితులకు భూములను మంజూరు చేసిందన్నారు. దానికి సంబంధించి ఇప్పటికీ లబ్ధిదారులకు భూములు చేరలేదన్నారు. దళితులకు ఇచ్చిన భూములు ఇప్పటికీ గ్రామంలోని ఓ రైతు చేతులోనే ఉన్నాయన్నారు. వాటిని విడిపించి లబ్ధిదారులకు అందించాలన్నారు. కార్యక్రమంలో పాపారావు, అద్దంకి కార్తీక్, ఎమ్మార్పీఎస్ నాయకులు జరుగుమల్లి విజయరత్నం, జెడ్డా వాసు పాల్గొన్నారు.

గృహ నిర్మాణదారులకు అదనపు సాయం

ఉదయగిరి : మండలంలో పక్కా గృహాలను నిర్మించుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం ప్రకటించినట్లు హౌసింగ్ ఏఈ రామకృష్ణ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 491 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ఈ అదనపు ఆర్థిక సాయం పొందేందుకు అర్హత పొందారన్నారు. కులాల వారీగా రూ.10 వేలు నుంచి రూ.లక్ష వరకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే జరిపి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

ముందుగానే నిలిచిన రేషన్ పంపిణీ

ఆత్మకూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. కాగా ప్రతి నెలా 18వ తేదీ వరకు రేషన్ సరుకులను పంపిణీ చేయాల్సి ఉండగా ఈనెలలో 17వ తేదీ రాత్రి 9 గంటలకే యాప్ నిలిపివేయడంతో సరుకుల పంపిణీ ఆగింది. దీంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. పట్టణంలో 8 రేషన్ పంపిణీ వాహనాలు ఉన్నా కేవలం నాలుగు మాత్రమే సరఫరా చేస్తున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో రేషన్ బియ్యం సరఫరా కాకపోవడంతో పలు కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరుకులు పంపిణీ చేసే వాహనాల వద్ద వాదులాటకు దిగుతున్నారు. మంగళవారం సాయంత్రం 16వ వార్డుకు చెందిన పలువురు మహిళలు హిల్ రోడ్డు వద్ద రేషన్ సరుకులను సరఫరా చేసే వాహనాన్ని నిలిపి తమ ప్రాంతంలో కొందరికే సరఫరా చేశారని, మిగిలిన వారికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీంతో సదరు వాహన డ్రైవర్ యాప్ సోమవారం రాత్రితో నిలిచిపోయిందని తెలిపారు. ఇదేలా 19, 20వ వార్డుల్లో రేషన్ సరఫరా చేసే వాహనం నిలిచిపోవడంతో మరో వాహనానికి ఆ ప్రాంతానికి జత చేశారు. ఆ వాహనదారుడికి రెండు నెలలుగా జీతం పడకపోవడంతో ఈనెల సరఫరాను నిలిపివేశారు. దీనిపై అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సోమశిల : సైబర్ నేరాలు, మోసాలపై అప్రమత్తత అవసరమని బ్యాంక్ అధికారులు సూచించారు. అనంతసాగరం మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో అవార్డు స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏపీజీ బ్యాంక్ హెచ్ఓ రాజశేఖర్, మేనేజర్ సంజీవ్, రిటైర్డ్ మేనేజర్ సూర్యప్రకాష్ హాజరై, మాట్లాడారు. బ్యాంకులు అందించే సామాజిక భద్రత పథకాలు పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, పీఎంఏపీవై, సుకన్య వంటి పథకాలలో చేరి ఆర్థిక భరోసా పొందాలన్నారు. అందరూ బ్యాంక్ ఖాతాల ద్వారా ప్రభుత్వం అందించే పథకాలను ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో అనంతసాగరం ఎఫ్ఈఓ అక్కలరెడ్డి అంకిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, వీహెచ్ఏ రమ్య, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీనివాసులు, ఏసుబాబు, పద్మావతి పాల్గొన్నారు.

చిల్లచెట్ల నరికివేతకు వేలంపాట

కొండాపురం : మండలంలోని రేణమాల పంచాయతీ చెరువులో చిల్లచెట్ల నరికివేతకు ఇరిగేషన్ అధికారులు మంగళవారం వేలంపాట నిర్వహించారు. కలిగిరి మండలం చీమలపాళేనికి చెందిన చీమల నాగయ్య రూ.2.25 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ వేలంలో నలుగురు రైతులు పాల్గొన్నారు.

ఉప్పుటేరు వాగులో..

మండలంలోని చింతలదేవి వద్ద ఉప్పుటేరు వాగు నుంచి బీమవరప్పాడు పంచాయతీ మేదరమెట్ల పాళెం వరకు వాగులో ఉన్న చిల్లచెట్లకు ఇరిగేషన్ ఏఈ రమేష్ సాయిపేటలో వేలం నిర్వహించారు. ఇందులో గుడ్లూరుకు చెందిన ఎం.సుబ్బారావు రూ.6.50 లక్షలకు వేలం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఏడాదిపాటు చిల్లచెట్లను నరుక్కోవచ్చని తెలిపారు. సర్పంచ్‌లు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సాయిపేటలో వేలం నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఏఈ

స్వీయ రక్షణపై విద్యార్థినులకు అవగాహన

సంగం : స్థానిక జెడ్పీ హైస్కూల్, గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు స్వీయ రక్షణపై సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రూపేష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ నరేష్ విద్యార్థినులకు కరాటే, మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థినులు తమకు తాము రక్షణ కల్పించుకునేలా తయారవ్వాలని సూచించారు. ఆపద వేళల్లో ఎవరి మీద ఆధారపడకుండా మార్షల్ ఆర్ట్స్, కరాటే వంటి వాటిపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

ఆదరణ-3పై అవగాహన

సంగం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ షాలెట్ మండలంలోని కులవృత్తిదారులకు ఆదరణ-3 పథకంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం కులవృత్తిదారులకు ఆధునిక ఉపకరణాలను అందిస్తుందని తెలిపారు. ఈఓపీఆర్డీ వరప్రసాద్ ఉన్నారు.

- **ఆత్మకూరురూరల్ :** ఆదరణ-3 పథకంపై ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ డేవిడ్, పరిపాలనాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్ : మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్